సాక్షి అనంతపురం

మంగళవారం ౹ 12 ౹ డిసెంబర్ ౹ 2023



‘అనంత’దే అగ్రస్థానం

పోగొట్టుకున్న, అపహరణకు గురైన సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే ‘అనంత’ అగ్రస్థానంలో ఉందని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. 8లో



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.7°/18.8°

సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

• హరహర మహాదేవ శంభోశంకర



కార్తీక మాస చివరి సోమవారం శైవక్షేత్రాలు శివనామ స్మరణతో ప్రతిధ్వనించాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. బియ్యపు పిండి, ఉసిరి, నిమ్మ, మట్టి ప్రమిదల్లో నెయ్యి, నూనె పోసి దీపారాధన చేశారు. దీపాల వెలుగులో ఆలయాలు కాంతులీనాయి. – అనంతపురం కల్చరల్



అనంతపురంలో దీపం వెలిగిస్తున్న యువతి



అనంతపురం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన ఈవీఎం బ్యాటరీలు



ఈవీఎంల బ్యాటరీలను గోదాములోకి చేరుస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలకు సంబంధించిన 150 బ్యాటరీలు పుణే నుంచి సోమవారం జిల్లాకు చేరాయి. వీటిని అధికారులు కలెక్టరేట్‌లోని గోదాములో భద్రపరిచారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ కవిరాజు

అనంతపురం అర్బన్: బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓగా నియమితులైన కవిరాజును కలెక్టర్ గౌతమి సూచించారు. అనంతపురం జిల్లాలో 11 ఏళ్లు సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేసిన కవిరాజు ఈ ఏడాది గ్రూప్‌-1లో అర్హత సాధించారు. శ్రీసత్యసాయి జిల్లా ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం అనంతపురం కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలతో మమేకమై విమర్శలకు తావివ్వకుండా బాధ్యతగా పనిచేసి మన్ననలు పొందాలని కలెక్టర్ నూతన ఎంపీడీఓకు సూచించారు.

సైన్స్‌ఫేర్‌కు సన్నద్ధం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్)కు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈఓ వి.నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి యూ.బాలమురళీకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19న జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రతి మండలం నుంచి మూడు ప్రాజెక్ట్‌లకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అయితే చాలా స్కూళ్ల నుంచి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నందున మండలంలోని స్కూళ్ల నుంచి వచ్చిన వాటిలో మూడింటిని ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఈనెల 14లోగా అన్ని ప్రభుత్వ యాజమాన్యాల స్కూళ్లకు సంబంధించి ఒక్కో పాఠశాల నుంచి మూడు ప్రాజెక్ట్‌లకు సంబంధించిన వీడియోలు, డాక్యుమెంట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రత్యేక బృందం వీటిని పరిశీలించి మండలానికి మూడు ప్రాజెక్ట్‌లను ఎంపిక చేస్తుందని తెలిపారు.

ఇక పిచికారీ స్మార్ట్

పంటలకు పురుగు మందులు...ద్రవ రూప ఎరువుల పిచికారీ ఇక స్మార్ట్‌గా మారనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలకు అండగా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకు కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తెచ్చింది. యాంత్రీకరణ వ్యవసాయ రంగంలో భారీ మార్పులకు, సరికొత్త ఆవిష్కరణలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. విత్తు విత్తినప్పటి నుంచి పంటపై పురుగుమందు పిచికారీ చేసేందుకు కూలీలు అందుబాటులో లేక రైతు పడే అవస్థలకు డ్రోన్లతో చెక్ పడనుంది.

అందుబాటులోకి కిసాన్ డ్రోన్లు

- 26 మందికి ప్రత్యేక శిక్షణ
- పురుగుమందులు, ద్రవరూప ఎరువుల పిచికారీ
- పంట పొలాలకు తొలగనున్న చీడపీడల బెడద



శెట్టూరు మండలం తిప్పనపల్లిలో డ్రోన్ సాయంతో వేరుశనగకు పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మానవ రహితంగా గాలిలో ఎగురుతూ పంటలను పర్యవేక్షించే యంత్రమే డ్రోన్. ఇది తీసే చిత్రాల ఆధారంగా పైరు ఎదుగుదల ఎలా ఉంది.. చీడపీడలు ఏవైనా ఆశించాయా.. ఎక్కడెక్కడ పైరు దెబ్బతిన్నది వంటి విషయాలను తెలుసుకోవచ్చు. ఒకవేళ ఎక్కడైనా పురుగుమందు పిచికారీ చేయాల్సి ఉంటే ఈ యంత్రం ద్వారానే సులువుగా నిమిషాల్లో పని పూర్తి చేయవచ్చు. జిల్లాలో 31 డ్రోన్లకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. 31 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా డ్రోన్‌ల వినియోగంపై వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. డ్రోన్ల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఐదుగురు రైతులు కలిగిన ఒక గ్రూప్‌కు ఒక పైలెట్ ఉంటారు. పైలెట్ ఆధీనంలో డ్రోన్ ఆపరేట్ అవుతుంది.

26 మంది పైలెట్లకు శిక్షణ

డ్రోన్ వినియోగంపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 26 మంది పైలెట్లకు శిక్షణ ఇచ్చారు. ఒక్కో డ్రోన్ ఖరీదు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుంది. రైతు గ్రూపులకు 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తుంది. మిగిలిన సొమ్ములో సగం రైతులు భరిస్తే మిగతా మొత్తాన్ని బ్యాంక్ రుణంగా పొందవచ్చు. డ్రోన్ వినియోగాన్ని బట్టి ఆదాయం పొంది రుణం తిరిగి చెల్లించవచ్చు. ఈ యంత్రం ద్వారా ఎకరాకు పురుగు మందు... ద్రవ రూపంలో ఉన్న ఎరువును 10 నిమిషాల్లో స్ప్రే చేయవచ్చు. గంటకు ఆరు ఎకరాల చొప్పున రోజుకు దాదాపు 50 ఎకరాల్లో మందు పిచికారీ చేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

సేద్యంలో రైతులకు తోడుగా...

ప్రస్తుతం పొలాల్లో పురుగుమందు చల్లాలంటే రైతులు లేదా కూలీలు పవర్ స్ప్రేయర్లు వినియోగిస్తున్నారు. మందు చల్లే సమయంలో దాని వాసనకు కొందరు అస్వస్థతకు గురికావడం, స్పృహ కోల్పోవడం జరుగుతోంది. ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయిన దాఖలాలూ ఉన్నాయి. వీటన్నిటినీ అధిగమించేందుకు శాస్త్రవేత్తలు వ్యవసాయంలో రైతులకు తోడుగా డ్రోన్లను తీసుకొచ్చారు. కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులు డ్రోన్లను వినియోగించుకుని సకాలంలో తెగుళ్లబెడద నుంచి పంటలను రక్షించుకునే వీలుంది.

చాలా కొత్తగా ఉంది



“ ఇప్పటివరకు మేము ఇలాంటి యంత్రాలను టీవీలలోనే చూశాం. మా ఊర్లో ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. చాలా కొత్తగా ఉంది. పంటలకు ఇలాంటి వాటితో మందులు కొట్టొచ్చు అనేది ఇప్పుడే తెలిసింది. మాలాంటి రైతులకు డ్రోన్ వినియోగంపై మరింత అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– నరసింహ, రైతు, తిప్పనపల్లి

రైతుల్ని చైతన్యవంతం చేస్తున్నాం



డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రూపులుగా ఏర్పడే రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. పైలెట్లకు ఇప్పటికే శిక్షణ ఇప్పించాం. శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో డిమాండ్ బాగా ఉంటుందని భావిస్తున్నాం. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా రైతులకు డ్రోన్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది.

– ఉమా మహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

సంతృప్తికర పరిష్కారం చూపండి

- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపించాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. ఏదశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ‘స్పందన’లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 335 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ‘స్పందన’, ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాల్లో అందే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా గడువుకు ముందే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఏ ఒక్క అర్జీ రీ–ఓపెన్ కాకూడదన్నారు. అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు రోజూ సిబ్బందితో సమీక్షిస్తుండాలని ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని...

- శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసేందుకు ప్రభుత్వం ద్వారా అనుమతి మంజూరు చేయించాలని నగరంలోని హమాలీ కాలనీకి చెందిన మాజీ నక్సలైట్, ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షుడు నెరిమెట్ల ఎల్లన్న కలెక్టర్ కోరారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న తాను 2003లో జనజీవన స్రవంతిలో కలిశానని చెప్పారు. లొంగిపోయిన తరువాత 2013లో డిగ్రీ, 2014–16లో పీజీ, 2018–20లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశానని తెలిపారు. ఇప్పుడు పీహెచ్‌డీ చేయాలని ఉందన్నారు. లొంగిపోయిన నక్సల్స్ పునరావాసం–రిలీఫ్ స్కీమ్ కింద ఎస్‌కేయూలో ప్రత్యేక కోటా కింద రూరల్ డెవలప్‌మెంట్ అండ్ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్లో పీహెచ్‌డీ చేసేందుకు ప్రభుత్వం ద్వారా అనుమతి మంజూరు చేయించాలని కోరారు.
- తమ పొలానికి వెళ్లే రస్తాకు పక్క పొలం రైతులు కంచె వేసి ఇబ్బంది పెడుతున్నారని యల్లనూరు మండలం యల్లనూరు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 959–2లో 4.30 ఎకరాల భూమి తమకు ఉందన్నాడు. తమ భూమిలోకి వెళ్లకుండా పక్కనున్న రైతులు రస్తాకు ముళ్ల కంచె వేశారని చెప్పాడు. విచారణ చేసి తమకు రస్తా చూపించాలని విజ్ఞప్తి చేశారు.

మాకు న్యాయం చేయండి



తల్లితో బాధితుడు దస్తగిరి

శింగనమల మండల ఆకులేడు గ్రామానికి చెందిన దస్తగిరి సోమవారం తల్లితోపాటు కలెక్టరేట్‌కు వచ్చి ‘స్పందన’లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి తన సమస్యను విన్నవించుకున్నాడు. సర్వే నంబరు 173–3లో తరాలుగా సాగు చేసుకుంటున్న 12.47 ఎకరాల భూమికి రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట పట్టాలు ఇచ్చారని ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరాడు.

రేపు శింగనమలలో ‘జగనన్నకు చెబుదాం’

శింగనమల: జగనన్నకు చెబుదాం మండలస్థాయి కార్యక్రమం బుధవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈశ్వరమ్మ తెలిపారు. కలెక్టర్ గౌతమి, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయవాదులకు చేయూత



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

- వైఎస్సార్ లా నేస్తం స్టైఫండ్ విడుదల
- జిల్లాలో 95 మంది లాయర్లకు రూ.26.80 లక్షలు జమ
- సద్వినియోగం చేసుకోవాలని సూచించిన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం అర్బన్: న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకం కింద చేయూతనందించింది. 2023–24 సంవత్సరానికి గాను రెండో విడతగా లా నేస్తం పథకం కింద ఆర్థికసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి జూనియర్ న్యాయవాదుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య జిల్లా చైర్మన్ నరసింహాగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వృత్తిలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న జూనియర్ లాయర్లకు ప్రభుత్వం తొలి మూడు సంవత్సరాలు అండగా ఉంటూ ప్రతి నెలా రూ.5 వేలు స్టైఫండ్ ఇస్తోందన్నారు. జిల్లాలో అర్హులైన 95 మందికి రూ.26.80 లక్షలను విడుదల చేసిందన్నారు.

స్టైఫండ్ మంజూరు ఇలా...

వైఎస్సార్ లా నేస్తం పథకం కింద లబ్ధి పొందిన 95 మందిలో 86 మందికి 6 నెలల స్టైఫండ్, ఇద్దరికి ఐదు నెలలు, నలుగురికి నాలుగు నెలలు, ఒకరికి మూడు నెలలు, నలుగురికి ఒక నెల స్టైఫండ్ మంజూరైందని కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ వెల్లడించారు. స్టైఫండ్ అందుకున్న జూనియర్ లాయర్లలో బీసీ వర్గానికి చెందిన వారు 46 మంది, ఎస్సీలు 13 మంది, ఎస్టీలు 10 మంది, ఓసీలు 26 మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటును జూనియర్ లాయర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు క్షేత్రస్థాయిలో కరువు పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్/గుత్తి రూరల్/ రాయదుర్గం రూరల్/ గుమ్మఘట్ట : జిల్లాలో కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ నేతృత్వంలోని పది మందితో కూడిన బృందం సోమవారం రాత్రే అనంతపురం చేరుకుంది. మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కలెక్టరేట్‌లో కరువు పరిస్థితులపై ఫొటో ఎగ్జిబిషన్ తిలకించి, జిల్లా అధికారులతో సమావేశమై సమీక్షించనుంది. అనంతరం మూడు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనుంది.

- మొదటి బృందం (డాక్టర్ కె.పొన్నుస్వామి, మహేష్‌కుమార్, కైలాష్‌శంఖలా) అనంతపురం రూరల్ మండలం కందుకూరులో కంది పంట, ఆత్మకూరు మండలం తలుపూరులో ఆముదం పంట పరిశీలించి పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ బృందానికి డీఆర్‌సీ డీడీ మద్దిలేటి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.
- రెండో బృందం (పి.దేవేంద్రరావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఆంజుబసేరా) కళ్యాణదుర్గం మండలంలో ఆముదం, కంది, ఉలవ పంటలు పరిశీలించనుంది. గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామాల్లో వేరుశనగ, కంది, ఆముదం, పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. బీసీ ల్యాబ్ ఏడీఏ పద్మలత నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.
- మూడో బృందం (అనురాధబట్నా, సంతోష్, సంజీత్‌కుమార్) గుత్తి మండలం వన్నేదొడ్డిలో ఆముదం, కంది పంటలు, తాగునీటి సరఫరా, పామిడి మండలం అనుంపల్లిలో పత్తి, కంది పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనుంది. భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజాపుష్పలత నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. మూడు బృందాలు క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులు తెలుసుకుని రాత్రికి అనంతపురం చేరుకునేలా వ్యవసాయశాఖ వర్గాలు రూట్‌మ్యాప్ తయారు చేశాయి. మరుసటి రోజు బుధవారం శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, ఎన్‌టీఆర్ జిల్లాలకు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

నివేదికలు సిద్ధంగా ఉంచుకోండి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్ తదితరులు

అనంతపురం అర్బన్: కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో కరువు పరిస్థితులకు సంబంధించిన సమగ్ర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. మంగళవారం కేంద్ర కరువు బృందం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమమాహేశ్వరమ్మతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కరువు పరిస్థితులపై సమీక్ష అనంతరం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందన్నారు. ఆ సమయంలో సమగ్ర సమాచారంతో కూడిన నివేదిక సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. బృందం పర్యటనకు నియమించిన నోడల్ అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కరువు బృందం పర్యటించే ప్రాంతాల్లో అన్ని వివరాలు తెలిసేలా ఫొటోలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. సంబంధిత తహసీల్దారు, ఎంపీడీఓ, ఎస్‌హెచ్‌ఓ, ఏడీఏ అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

3.77 లక్షల ‘ఓటరు’ దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే, పరిశీలనలో ఈ నెల 9 వరకు 3,77,498 దరఖాస్తులు అందాయని కలెక్టర్ గౌతమి తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఆమె సోమవారం మీడియాకు వెల్లడించారు. సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగానూ, పకడ్బందీగానూ నిర్వహించామని తెలిపారు. తప్పిదాలకు తావివ్వకుండా కచ్చితత్వం పాటించామన్నారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 26లోగా ఈఆర్‌ఓలు పరిష్కరిస్తారన్నారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు.

- కొత్తగా ఓటరు నమోదుకు, ఓట్ల తొలగింపునకు, చేర్పులు, మార్పులకు సంబంధించి మొత్తం 3,77,498 దరఖాస్తులు అందాయి. వీటిలో 2,64,751 దరఖాస్తులు ఆమోదించగా 33,965 తిరస్కరణకు గురయ్యాయి. 78,782 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం–6) 1,33,696 దరఖాస్తులు రాగా 92,788 ఆమోదించగా 11,512 తిరస్కరించారు. 29,396 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ఓటు తొలగింపునకు (ఫారం–7) 1,16,004 దరఖాస్తులు రాగా.. అందులో 64,393 ఆమోదించగా 17,189 తిరస్కరించారు. 34,422 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- చేర్పులు, మార్పులకు (ఫారం–8) 1,27,798 దరఖాస్తులు రాగా.. అందులో 1,07,570 ఆమోదించగా 5,264 తిరస్కరించారు. 14,964 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' అంశంపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచనలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని జేపీఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో 'వై ఏపీ నీడ్స్ జగన్' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, జేపీఎస్ఎస్ వ్యవస్థాపకుడు కట్టుబడి తానీషా పర్యవేక్షించారు. అధ్యాపకులు రామాంజినేయులు, షఫీ, సంఘం సభ్యులు ఆకర్ష్, దావూద్, షాషావలి పాల్గొన్నారు.

నిలకడగా మల్లేష్ ఆరోగ్యం

అనంతపురం మెడికల్: ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న ఉపాధ్యాయుడు మల్లేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటకలో పామిడి వాసుల అరెస్ట్

శ్రీనివాసపురం (కర్ణాటక): ద్విచక్ర వాహనదారుడిపై మత్తు మందు చల్లి డబ్బు, మొబైల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఘటనలో పామిడికి చెందిన ఇద్దరిని కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... పామిడి పంచాయతీ మజారా గ్రామమైన కొండాపురానికి చెందిన గణేష్ (అయ్యప్ప మాలధారి), మరో బాలుడు.. సోమవారం ఉదయం కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా తొట్టి గ్రామం వద్ద వెళుతూ అటుగా వచ్చిన ద్విచక్ర వాహనదారు వెంకటేష్‌ను లిఫ్ట్ అడిగారు. దీంతో వాహనాన్ని వెంకటేష్ ఆపడంతో వెంటనే అతని ముఖంపై బూడిదలాంటి పదార్థాన్ని చల్లారు. ఘటనతో మైకం కమ్మి మత్తులోకి జారుకున్న అనంతరం వెంకటేష్ వద్ద ఉన్న రూ.700 నగదు, మొబైల్ ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. దాదాపు 20 నిమిషాల తర్వాత తేరుకున్న వెంకటేష్ వెంటనే విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో వారు గాలించి ఇద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న కళాఉత్సవ్

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం నిర్వహించిన కళాఉత్సవ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులను ఈ నెల 14, 15వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ పర్యవేక్షించారు.

అనంతదే అగ్రస్థానం

- రూ.71 లక్షలు విలువ చేసే 385 సెల్‌ఫోన్ల స్వాధీనం
- ఇప్పటి వరకూ రూ.13.13 కోట్ల విలువ చేసే 8,010 ఫోన్ల రికవరీ
- ఎస్పీ అన్బురాజన్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్



అవార్డు అందుకుంటున్న కుందుర్పి కానిస్టేబుల్ అనిల్

అనంతపురం క్రైం: చోరీ జరిగిన, సొంతదారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా పోలీసులు అగ్రస్థానంలో నిలిచారని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. చాట్‌బాట్ సేవలు అందుబాటులో వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో రూ.13.13 కోట్లు విలువ చేసే 8,010 సెల్‌ఫోన్లు రికవరీ చేసి సొంతదారులకు అందజేసినట్లు వివరించారు. ఇటీవల వివిధ కేసుల్లో పోలీసులు రికవరీ చేసిన రూ.71 లక్షలు విలువ చేసే 385 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో సంబంధీకులకు సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఏపీలోని 9 జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌కు చేతులు మారిపోయిన సెల్‌ఫోన్లను కూడా రికవరీ చేసినట్లు వివరించారు.

పాత ఫోన్లు కొనొద్దు

ఫోన్‌లు కొనుగోలు చేసే వారెవరైనా పాత ఫోన్‌లను కొనకపోవడం మంచిదని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి అస్సలు కొనుగోలు చేయరాదన్నారు. పరిచయస్తుల ద్వారా కొనుగోలు చేస్తే ఫోన్‌కు సంబంధించిన బాక్స్‌తో పాటు బిల్లు తప్పక తీసుకోవాలన్నారు. ఫోన్ తక్కువ ధరకు వస్తుందని ఆశపడి కొనుగోలు చేస్తే అనవసరంగా పోలీసు కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫోన్లు చోరీకి గురైనా, కనపడకుండా పోయినా సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఫోన్లు విక్రయిస్తున్న అపరిచిత వ్యక్తులపై అనుమానం వస్తే వెంటనే 94407 96800కు సమాచారం అందించాలని కోరారు.

పోగొట్టుకున్న డబ్బు ఖాతాలో పడుతుంది

బ్యాంక్ ఖాతాలోని సొమ్మును సైబర్ నేరగాళ్లు కాజేస్తే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయడం ద్వారా గంట వ్యవధిలోనే ఆ డబ్బు తిరిగి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని ఎస్పీ వివరించారు. 1930 సేవలను సకాలంలో వినియోగించుకోవాలన్నారు. అన్ని యాప్‌లకు గుడ్డిగా అనుమతులివ్వకూడదన్నారు.

'పోలీసు స్పందన'కు 128 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 128 వినతులు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఇందిర, దిశ సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి కృతజ్ఞతలు

రౌడీ మూకలు కబ్జా చేసిన తమ స్థలాలను తిరిగి స్వాధీనం చేసేందుకు ఎస్పీ అన్బురాజన్ చూపిన చొరవను అభినందిస్తూ 73 మంది బాధితులు సోమవారం ఆయనను కలసి కృతజ్ఞతలు తెలిపారు. తమలో చాలా మంది ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులుగా ఉన్నామని, ఉద్యోగ విరమణ సమయంలో అందిన డబ్బుతో స్థలాలు కొనుగోలు చేసినట్లు వివరించారు. వీటిని కొందరు రౌడీ మూకలు కబ్జా చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని తమ స్థలాలు తిరిగి స్వాధీనం చేసిన ఎస్పీ అన్బురాజన్ సేవలను మరిచిపోలేమంటూ సన్మానం చేశారు. కాగా, మొత్తం ఈ వ్యవహారంలో బాధితుల పక్షాన నిలిచి పోరాటం చేసిన నూర్ బాషాకే సన్మానం పొందే అర్హత ఉందని, ఎస్పీ ప్రతిగా ఆయనకు సన్మానం చేశారు.

కానిస్టేబుల్‌కు అవార్డు

కుందుర్పి: సైబర్ క్రైం కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరచిన కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనిల్‌ను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఇటీవల చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో అనిల్ చూపిన చొరవను అభినందిస్తూ సోమవారం డీపీఓలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ అభినందిస్తూ అవార్డు అందజేశారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

అనంతపురం క్రైం: జల్సాల కోసం ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను సీసీఎస్, వన్‌టౌన్, ఉరవకొండ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం బూబుసానిపల్లికి చెందిన గువ్వల పుల్లారెడ్డి, బ్రహ్మంగారి మఠం మండలం పాపిరెడ్డిపల్లి నివాసి గుంప వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరిద్దరూ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. వీరిపై గతంలో వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల, అనంతపురం నాల్గో పట్టణ, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులున్నాయి. చాలా కాలంగా ఇద్దరూ ఉరవకొండ, తాడిపత్రి, బళ్లారి, కర్నూలు తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించారు. ఆయా కేసుల దర్యాప్తులో భాగంగా పాత నేరస్తులపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు జీటీనాయుడు, రెడ్డప్ప, సీసీఎస్ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది తిరుమలేష్, ప్రవీణ్, శ్రీనివాసులును ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



శిల్ప (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. వివరాలు... కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లికి చెందిన దోణ తిమ్మప్ప భార్య శిల్ప (29) నిర్మాణంలో ఉన్న ఇంటికి సోమవారం ఉదయం క్యూరింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. పని ముగియగానే మోటార్ ఆఫ్ చేసే క్రమంలో ప్లగ్ తీస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, శిల్పకు ఆరేళ్ల వయసున్న కుమారుడు, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోడిపెంట కింద గోవా మద్యం

- ఆరుగురి అరెస్ట్
- ఐచర్ వాహనంతో పాటు కారు, రూ. 35 వేల నగదు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న సెబ్ పోలీసులు

అనంతపురం క్రైం: కోడి పెంట కింద మద్యం బాటిళ్లు దాచి అక్రమంగా గోవా నుంచి అనంతకు తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఈ కేసులో మొత్తం ఆరుగురిని సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీపీఓలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ ఏఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ఈదులముష్టూరు నివాసి మాలపాటి రవితేజ, ధర్మవరం కేతిరెడ్డి కాలనీకి చెందిన షాహిద్ ఖాన్, అనంతపురం నగరం కేతిరెడ్డి కాలనీకి చెందిన లోచర్ల హరికృష్ణ, పుట్లూరు మండలం చింతరపల్లి గ్రామానికి చెందిన పుట్లూరు రామాంజినేయరెడ్డి, శింగనమల మండలం కొరివిపల్లి నివాసి దూదేకుల కుళ్లాయిస్వామి (ప్రస్తుతం తాడిపత్రి టైలర్స్ కాలనీలో నివాసం), తాడిపత్రిలోని రెడ్డివారిపల్లి వీధికి చెందిన చన్నా జయచంద్ర ప్రతాప్ బృందంగా ఏర్పడి రెండు నెలల క్రితం ఒక సెకండ్ హ్యాండ్ ఐచర్ వాహనాన్ని కొనుగోలు చేశారు. అనంతరం గోవాకు వెళ్లి అక్కడ ఫుల్‌బాటిళ్ల మద్యం కొనుగోలు చేసి ఐచర్ వాహనంలో కోడి పెంట కింద దాచి జిల్లాకు తీసుకొచ్చి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ క్రమంలో మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచిన సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, అర్బన్ డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ సుధాకరయాదవ్, సిబ్బంది బృందాలుగా విడిపోయి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురంలోని చెరువు కట్ట వద్ద పటిష్ట తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన షిఫ్ట్ కారును ఆపి తనిఖీ చేస్తుండగా అందులో ప్రయాణిస్తున్న వారి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఆరా తీశారు. దీంతో మద్యం అక్రమ రవాణా వెలుగు చూసింది. అదే సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా కోడిపెంట కింద దాచిన 262 ఫుల్ బాటిళ్ల మద్యం బయటపడింది. ఐచర్‌తో పాటు కారును సీజ్ చేసి, రూ.35,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- చిలమత్తూరు కేజీబీవీలో ఘటన

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థిని సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేసింది. రోజువారీ రాత పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పరీక్షలో సదరు విద్యార్థిని కాపీ కొట్టిందని ఒకేషనల్ ఉపాధ్యాయురాలు ప్రమీలకు సహ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను నోట్‌బుక్కులు ఆఫీస్ రూంలో పెట్టి రావాలని ఉపాధ్యాయురాలు ఆదేశించారు. ఈ అంశాన్ని అవమానకరంగా భావించిన ఆమె నేరుగా పై అంతస్తులో ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి విషపూరిత ద్రావకం తాగింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీశారు. ఎస్ఓ రెహానా మాట్లాడుతూ.. చాలా సున్నిత మనస్తత్వం కలిగిన సదరు విద్యార్థి కాపీ కొట్టిందని తెలిసినా ఎవరూ ఏమీ అనలేదన్నారు. పాఠశాలలో అందరూ స్నేహభావంతోనే మెలుగుతారని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కేజీబీవీ ఎస్ఓకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు.



'ఎన్ఎల్‌యూ' ప్రవేశ పరీక్షల్లో 'వినూత్న' ప్రతిభ

- ఏపీ జనరల్ కేటగిరిలో రెండు, ఉమెన్ కేటగిరిలో ప్రథమస్థానం
- దేశ స్థాయి జనరల్ కేటగిరీలో 470వ ర్యాంకు



వినూత్న

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ లా యూనివర్సిటీల (ఎన్ఎల్‌యూ) ప్రవేశ పరీక్షలో అనంతపురానికి చెందిన కాపు వినూత్న జాతీయ స్థాయిలో సత్తా చాటింది. లక్ష మందికి పైగా పోటీ పడిన ఈ పరీక్షలో దేశ స్థాయి జనరల్ విభాగంలో 470వ ర్యాంక్ సాధించింది. జనరల్ కేటగిరీలో మొత్తం 1,504 ఖాళీలను భర్తీ చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ జనరల్ కేటగిరీలో 30 ఖాళీలను భర్తీ చేయనుండగా వినూత్నకు రెండో ర్యాంకు దక్కింది. ఏపీ ఉమెన్ కేటగిరీలో 22 ఖాళీలను భర్తీ చేయనుండగా వినూత్న మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 3న నేషనల్ లా యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష జరిగింది. ఫలితాలు ఆదివారం రాత్రి విడుదలయ్యాయి. వినూత్న తండ్రి కాపు విజయచంద్రారెడ్డి గతంలో డీసీసీబీ సీఈఓగా పని చేశారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఏపీ సీఓటీసీఐటీలో ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. తల్లి కాపు మధురిమ గృహిణి.

ఉపాధ్యాయ లోకాన్ని తప్పుదారి పట్టించే యత్నం

- మల్లేష్ ఉదంతంపై వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: టీచరు మల్లేష్ ఆత్మహత్యాయత్నం ఘటనపై ఉపాధ్యాయ లోకాన్ని తప్పుదారి పట్టించి లబ్ధి పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీచరు మల్లేష్ ఆత్మహత్యాయత్నం బాధాకరమన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే దానిని కొన్ని పత్రికలు, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఆపాదిస్తుండడం శోచనీయమన్నారు. ఆయన రాసినట్లుగా చూపిస్తున్న లేఖలో కనీసం సంతకం లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కేవలం అనారోగ్య, ఆర్థిక కారణాల వల్ల టీచరు మల్లేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని స్పష్టం చేశారు. మల్లేష్ సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడాలని ఆకాంక్షించారు.

వరుడిపై కేసు నమోదు

కదిరి టౌన్: వధువును మోసం చేసిన వరుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో నివాసముంటున్న యువతితో అనంతపురంలోని ఆదర్శనగర్‌కు చెందిన రెడ్డప్ప కుమారుడు శ్రీకాంత్‌కు గత నెల 28న పెద్ద సమక్షంలో వివాహ నిశ్చితార్థం జరిగింది. పరస్పరం ఉంగరాలు మార్చుకున్న అనంతరం వీరి వివాహాన్ని ఈ నెల 15న చేయాలని ఇరువైపులా పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని వరుడు శ్రీకాంత్ మొండికేశాడు. బలవంతంగా పెళ్లి చేస్తే ఆమెను చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. దీంతో పెళ్లి పేరుతో తమను మోసగించిన శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ వధువు తల్లిదండ్రులు సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాంత్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం: నగరంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వై.వి.మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హౌస్ వైరింగ్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, విద్యుత్ పరికరాల మరమ్మతులు, మోటార్ రివైండింగ్‌లో శిక్షణ ఉంటుంది. 45 రోజుల వ్యవధి గల శిక్షణకు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు, ఐదో తరగతి పాస్/ఫెయిల్, పదో తరగతి, ఐటీఐ, ఇంటర్ పాస్ అయిన వారు అర్హులు. ఈ నెల 14 నుంచి శిక్షణ మొదలవుతుంది. మధ్యాహ్నం ఉచిత భోజనం అందిస్తారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉచితంగా టూల్ కిట్, సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ఉపాధి అవకాశాలూ కల్పిస్తారు. మరింత సమాచారానికి 85000 74757, 77807 52418లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

డీవైఈఓను కలిసిన 'అపుస్మా' నాయకులు


డీవైఈఓ శ్రీనివాసరావుకు బొకే అందజేస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావును సోమవారం కలిశారు. ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించి అంశాలపై చర్చించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీవైఈఓ హామీ ఇచ్చారు. డీవైఈఓను కలిసిన వారిలో అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ కన్వీనర్ నాగరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ రవిశంకర్ ప్రసాద్, నాయకులు సూర్యనారాయణ రెడి, మధుసూదన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నవతా నారాయణ రెడ్డి, కూడేరు లోకనాథ్, జలీల్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి క్రైస్తవ పుస్తక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: నగరంలోని అరవింద నగర్ ఎల్ఈఎఫ్ చర్చిలో మంగళవారం క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభమవుతుందని చర్చి నిర్వాహకులు చార్లెస్ శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన బ్యూటిపుల్ బుక్స్ వారి ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. ఆధ్యాత్మిక గ్రంథాల ప్రదర్శనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్ఫూర్తినింపిన 'వికసిత భారత్'


ప్రధానమంత్రి ప్రసంగం వినేందుకు వచ్చిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనంతపురం: వికసిత భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ఇచ్చిన సందేశం విద్యార్థుల్లో స్ఫూర్తినింపింది. వికసిత భారత్ 2047: వాయిస్ ఆఫ్ యూత్' కార్యక్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాని ప్రసంగించారు. కార్యక్రమాన్ని అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలోని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ సభా మందిరంలో ప్రత్యేక తెరపై ఆవిష్కరించారు. 2047 నాటికి దేశం అభివృద్ధి, దాని ప్రాముఖ్యత, సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై మోదీ చేసిన ప్రసంగం ప్రొఫెసర్లు, విద్యార్థులను ఆకట్టుకుంది.

ఉపాధ్యాయుడికి జెడ్పీచైర్‌పర్సన్ పరామర్శ


ఉపాధ్యాయుడు మల్లేశ్‌ను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: నగరంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న విడపనకల్లు మండలం పాల్తూరు ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మల్లేశ్‌ను జెడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం పరామర్శించారు. ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నం చేసి, సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. విషయం తెలుసుకున్న గిరిజమ్మ ఆస్పత్రికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిపై డిప్యూటీ ఆర్ఎంఓ పద్మజా, డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మల్లేశ్ భార్య శివలక్ష్మితోనూ మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాల్మన్ సూచించారు. సోమవారం బొమ్మేపర్తి, బుక్కచెర్ల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగులకు చేతి వృత్తులపై శిక్షణ ఇచ్చి, రుణ సదుపాయం కల్పించే విశ్వ కర్మ యోజనతో పాటు ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, కేవీపీ తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం పేదరిక నిర్మూలన, వ్యవసాయ ఉత్పత్తులు, మహిళల సంక్షేమం, యువతకు స్వయం ఉపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు ఆనంద్ రెడ్డి, నారాయణమ్మ, వైద్యాధికారి శ్రావణి, ఏపీఎం శివకుమార్ రెడ్డి, వికసిత్ సంకల్ప కార్యక్రమం కోఆర్డినేటర్ రావి చైతన్య, ఏఎస్ఓ జ్యోతి, భారత్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ పిక్కిలి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరా...పాహిమాం


చిన్నారులతో కలిసి దీపాలు వెలిగిస్తున్న మహిళ


శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తురాలు


కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళా కానిస్టేబుల్


అరుణాచల గిరి ప్రదక్షిణలో భక్తులు

అనంతపురం కల్చరల్: ఈశ్వరా.. పరమేశ్వర..పరంధామా పాహిమాం అంటూ భక్తులు శైవక్షేత్రాల్లో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పలుచోట్ల పరమేశ్వరుడికి అన్నాభిషేకం జరిగింది. కార్తీక చివరి సోమవారానికి తోడు మాసశివరాత్రి కలిసి రావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో వేదమంత్రాలతో శ్రవణానందం కలిగింది. ఏకవార రుద్రాభిషేకాలు, భస్మార్చన, విశేష పుష్పాలంకార సేవలతో కాశీవిశ్వేరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. మారుతీ నగర్‌లోని శివాలయం, నాల్గోరోడ్డులోని రామలింగేశ్వరుడికి వందలాది మంది భక్తులు స్వయంగా అన్నాభిషేకం చేశారు. పాతూరులోని ప్రాచీన విరూపాక్షేశ్వరాలయం, శివకోటి, శివబాలయోగి ఆశ్రమం, అరవిందనగర్ సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీ నసనకోటముత్యాలమ్మ ఆలయం, మంజునాథ అన్నపూర్ణేరీ దేవస్థానం తదితర చోట్ల చివరి సోమవారం సందర్భంగా శారదా శృంగేరీ శంకరమఠంలో శంకర భగవత్పాదులకు శతరుద్రీయం భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్తీక దీపోత్సవాల సందడి కనిపించింది. బారులు తీరి భక్తులు తీర్థప్రసాదాలు అందుకున్నారు.

అనంత ముంగిట అరుణాచలేశ్వరుడు

నగరంలోని మూడోరోడ్డులో ఉన్న జీఆర్ ఫంక్షన్ హాలులో సాయిట్రస్టు ఆధ్వర్యంలో అరుణాచలం ఆలయ నమూనా ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు సాయంత్రం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రదోషకాలంలో లింగార్చన భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాత్రి గిరిజా కల్యాణం కనులపండువగా జరిగింది. అర్చకులు పార్వతీ పరమేశ్వరు పరిణయ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి , ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధి మణూరు నాగరాజు, ట్రస్టు సభ్యులు విజయ్‌సాయికుమార్, నాయక్, రాఘవేంద్ర హాజరయ్యారు.

మంజునాథుడికి కార్తీక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస సోమవారాన్ని పురస్కరించుకొని మంజునాథస్వామికి విశేష పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


మొదటిరోడ్డు శివాలయంలో కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళ, యువతులు


శివలింగాకారం


శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


శంకర భగవత్పాదులకు శతరుద్రీయం


పంపనూరులో ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు


మారుతీనగర్‌లో విశేష అలంకారంలో మహాశివుడు


అన్నాభిషేకంతో పూజలందుకున్న నాల్గోరోడ్డు రామలింగేశ్వరుడు


బాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న అనంతేశ్వరుడు




నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో పరమేశ్వరుడి అలంకరణ

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


వేపచెర్లలో ర్యాలీ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ హేమలత తెలిపారు. సోమవారం వేపచెర్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మొదట గ్రామ సచివాలయంలో గ్రామాభివృద్ధిని తెలుపుతూ మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అతిక్‌రెడ్డి, కృష్ణానాయక్, రవినాయక్, రాము నాయక్, సనప నరసింహులు, యల్లప్ప, లోకేష్, కృష్ణానాయక్, జగదీష్, రమేష్, రామచంద్రానాయక్, నరసింహులు, లక్ష్మీనారాయణ, బిల్లే గోపాల్, పోతన్న, మితానాయక్, మధు పాల్గొన్నారు.

జనసేన పార్టీవి దిగుజారుడు రాజకీయాలు


అనంతపురంలో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళలు

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధిని ఓర్వలేని జనసేన నాయకులు దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సిపీ మహిళా విభాగం జిల్లా, నగరాధ్యక్షురాళ్లు శ్రీదేవి, కృష్ణవేణి, కార్పొరేటర్లు రాజేశ్వరి, దుర్గాదేవి పేర్కొన్నారు. జనసేన పార్టీకి చెందిన శ్రీలత నగరంలో అభివృద్ధి జరగలేదని, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని విమర్శించడాన్ని ఖండిస్తూ సోమవారం స్థానిక పార్టీ కార్యాయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా రూ.800 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే 'అనంత' ప్రత్యేక చొరవతో నగరం రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.3 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. జనసేన నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, లేని పక్షంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకురాళ్లు శోభారాణి, భారతి, అంజలి పాల్గొన్నారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18న కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీవల్లి, దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపిస్తామని పేర్కొన్నారు.

కనకదాస జయంతి

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలో కనకదాస జయంతిని పురస్కరించుకొని గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురుబల ఆరాధ్యుడు కనకదాస చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి, భజనలు, కీర్తనలను పాడారు. ఏటా కనకదాస జయంతి సందర్భంగా గ్రామంలో కలసికట్టుగా వేడుకను జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోసే నాగార్జున, శంకరయ్య, ముత్యాలప్ప, చిన్నప్ప పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడికి సన్మానం


బసవరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టెపోగు బసవరావును ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సోమవారం సన్మానించారు. కట్టెపోగు బసవరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ గత నెల 17న ఇడుపులపాయ నుంచి పాదయాత్ర ప్రారంభించి, సోమవారం అనంతపురానికి చేరుకున్నారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, పాదయాత్ర ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాస రెడ్డి, చామలూరు రాజగోపాల్, పెన్నోబులేసు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

అనంతపురం కార్పొరేషన్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 62, 38, 56 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. 62వ సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం పాల్గొని, సంక్షేమ, అభివృద్ధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా రూ.800 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్‌రెడ్డి, చింతకుంట మధు, క్లస్టర్ అధ్యక్షుడు పీపీ రమణారెడ్డి, ఓబిరెడ్డి, జగదీష్, మధు, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇస్హాక్, బాలాంజనేయులు, చింతకుంట సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం ప్యాదిండిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ లింగారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, మనేరు నరసింహులు, నామాల ఓబిరెడ్డి పాల్గొన్నారు.

కనగానపల్లి: పేదలకు సంక్షేమ పథకాలు నిరంతరంగా అందాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ముత్తువకుంట్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా బోర్డులను సచివాలయంలో వారు ప్రదర్శించారు. ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ అశోక్, స్థానిక నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దేశం గర్వించేస్థాయిలో రాష్ట్ర ప్రగతి


బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రగతి దేశం గర్వించేస్థాయిలో సాధించిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ వరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, వైస్ సర్పంచ్ మాధవరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ముస్తఫా, మండల యూత్ కన్వీనర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ముందుగా సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వివరాలు పొందుపరిచిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో జెండా మోసేవాళ్లకే సంక్షేమ పథకాలు వచ్చేవని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అక్కున చేర్చుకొని మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇనాయతుల్లా, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, రసూల్, వెంకటేష్, రాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి బిల్లులు మంజూరు చేయించండి

కనగానపల్లి: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు సాగుచేసుకున్న రైతులకు నీటి బిల్లులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన.. రైతుల వినతి మేరకు స్థానిక ఎంపీడీఓ అలివేలమ్మ కలసి పెండింగ్‌లో ఉన్న పండ్ల తోటల బిల్లులపై చర్చించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం పండ్ల తోటల పెంపకం కోసం నిధులు కేటాయిస్తోందన్నారు. తద్వారా మండలంలోని వేలాది మంది మామిడి, చీనీ తోటలు సాగు చేసుకున్నారని, రెండేళ్లుగా నీళ్ల బిల్లు మంజూరు చేయలేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని ఆయన ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు పాపన్న, ఆలమూరప్ప, బీసీ ముత్యాలు, అశోక్, రామకృష్ణ, రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

విధులపై స్పష్టత కల్పించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఆత్మకూరు: విధులపై తమకు స్పష్టత కల్పించాలని మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది ఎంపీడీఓ రఘునాథ్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమను నాలుగేళ్లుగా అటు విద్యుత్ అధికారులు, ఇటు సచివాలయ శాఖకు సంబంధించి ఇద్దరు తీవ్ర ఒత్తిడితో పనిచేయిస్తున్నారన్నారు.దీంతో తమకు ఎస్ఆర్ కూడా అందలేదన్నారు. తమ ఉద్యోగాలకు సంబంధించి తమ విధులపై స్పష్టత కల్పించాలని ఎంపీడీఓను కోరారు. తమ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విద్యుత్ సిబ్బంది ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది లింగమయ్య, కొండన్న, శ్రీనివాసులు, బాలకృష్ణ, పవన్ కుమార్, ఆదినారాయణ, రామాంజి, శాంత కుమార్, మధుసూదన్, శీనానాయక్ పాల్గొన్నారు.

తరగతి గదుల మరమ్మతులకు ఆర్థిక సాయం

- కలెక్టర్‌కు అందించిన సిప్లాన్ డ్రగ్స్ ఎస్ఎం


కలెక్టర్ గౌతమికి చెక్ అందజేస్తున సిప్లాన్ డ్రగ్స్ సీనియర్ మేనేజర్ ఇర్ఫాన్

అనంతపురం అర్బన్ : అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తరగతి గదుల మరమ్మతుల కోసం సిప్లాన్ డ్రగ్స్ కంపెనీ రూ.2.10 లక్షలు ఆర్థిక సహాయం అందించింది. కలెక్టర్ గౌతమిని కంపెనీ సీనియర్ మేనేజర్ ఎస్ఎండీ ఇర్ఫాన్ సోమవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కలిసి చెక్కు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదుల మరమ్మతులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నాగరాజారావు, డీసీఓ మురళీ కృష్ణ పాల్గొన్నారు.

వీల్ చైర్ల వితరణ


సర్వజనాస్పత్రికి వీల్‌చైర్లను అందించిన యువత

అనంతపురం మెడికల్: నగరానికి చెందిన పలువురు యువకులు కమ్మూర్ వహీద్ బ్రదర్స్ ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెండు వీల్ చైర్లను అందించారు. సోమవారం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు వీల్ చైర్లను అందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఏఓ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీకమాస పూజలు

కనగానపల్లి: మండలంలోని శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. మండలంలోని తగరకుంట భ్రమరాంబిక మల్లేశ్వరాలయంలో ఉదయం నుంచి భక్తులు శివ లింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు అన్నదానం చేశారు. ముక్తాపురం ముక్తీశ్వరాలయం, పర్వత దేవరపల్లిలోని మల్లన్న ఆలయంలోనూ భక్తులు కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్దకు వచ్చి ప్రదక్షిణలు చేశారు.

రామగిరి: మండల వ్యాప్తంగా కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని రామగిరి, పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. ఆయా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, ముస్తాబు చేశారు. పేరూరులోని భోగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు రామకృష్ణస్వామి శివుడిని ప్రత్యేకంగా అలంకరించి, పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.